రిపోర్టర్లు కావలెను

పత్రిక ప్రారంభించిన అతి స్వల్ప కాలంలోనే అత్యధిక మంది పాఠకుల మన్ననలు పొందుతూ ముందుకు దూసుకెళ్తున్న క్విక్ టుడే దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను

అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం

EDITOR:
G.BUCHI REDDY
8125972476



quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY తెలుగు దినపత్రిక

QUICK TODAY Tv తెలుగు
8125972476

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 248 | సోమవారం | 15-06-2026 | వెల: 3 రూ./- | పేజీలు : 8 |
|---|---|---|---|---|---|---|
| MALKAJGIRI | Volume: 3 | Issue: 248 | Monday | 15-06-2026 | Price: ₹3/- | Pages: 8 |


## అధికారుల నిర్లక్ష్యంపై

# సీఎం సీరియస్

## ముందుగానే అప్రమత్తం చేసినా పట్టించుకోరా?

అలసత్వం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవు

వర్షా లపై అధికారుల సమన్వయం లోపంపై ఆగ్రహం

బ్లాక్‌స్పాట్లు, ట్రాఫిక్ జామ్ ప్రాంతాల డేటా గుర్తించాలి

చెట్లు కూలితే విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని సూచన

సన్న వడ్ల కోసం రైతులకు 8 రకాల వంగడాలు

రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ చేయాలి

సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**హైదరాబాద్, జూన్14(క్విక్ టుడే న్యూస్):**
వర్షాకాల సీజన్‌లో అధికారులు, యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తేల్చిచెప్పారు. అలసత్వంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాకాల సన్నద్ధతపై ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పేవిలియన్‌లో ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వేంనరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, తెలంగాణ

మిగతా 2లో



## ఐదేళ్లలో రెట్టింపు వాణిజ్యం

భారత్-ఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షిక ఒప్పందాలు

'భారత్ ఇన్నోవేట్స్ 2026' లో ప్రధాని మోదీ, ఫ్రాన్స్ మాక్రాన్

టెక్నాలజీ, రక్షణ, తయారీ రంగాల్లో భారత్ సామర్థ్యాల ప్రదర్శన

'మేక్ ఇన్ ఇండియా' ప్రయత్నాలకు మరింత ప్రోత్సాహం

ఫ్రాన్స్ పర్యటనలో ప్రధాని నరేంద్రమోదీ

**న్యూఢిల్లీ, జూన్14:**
ఫ్రాన్స్‌లో జరిగిన 'భారత్ ఇన్నోవేట్స్ 2026' కార్యక్రమంలో, ఫ్రెంచ్ కంపెనీలను తమ తయారీ, ఆవిష్కరణ కార్యకలాపాలను భారతదేశంలో విస్తరించాలని భారత

మిగతా 2లో

## మీనాక్షికి రేవంత్ వెన్నుపోటు



ఆమెకు రాజ్యసభ సీటు రాకుండా చేసింది ఆయనే

సీఎం అవినీతి, భూ ఒప్పందాలపై కాంగ్రెస్ అధిష్ఠానానికి మీనాక్షి ఫిర్యాదు

ప్రతీకారంగానే హైదరాబాద్‌లో ఆమెపై తప్పుడు కేసు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, జూన్14(క్విక్ టుడే న్యూస్):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. సొంత పార్టీ నేత, రాహుల్ గాంధీకి సన్నిహితురాలైన మీనాక్షి నటరాజన్‌కు రేవంత్ రెడ్డి వెన్నుపోటు పొడిచారని, ఆమెపై

మిగతా 2లో

## ట్రంప్ శాంతి మార్గం

లెబనాన్ సహా అన్ని ప్రాంతాలలో శాశ్వతంగా సైనిక చర్యల నిలిపివేత

ఈనెల 19న స్విట్జర్లాండ్‌లో ఇరు దేశాలు అధికారికంగా సంతకాలు

అమెరికా - ఇరాన్ దేశాలు చారిత్రాత్మక నిర్ణయం

'ట్రూత్ సోషల్' ద్వారా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ధ్రువీకరణ

వాణిజ్య నౌకల రాకపోకలకు తెరుచుకున్న హర్మూజ్ జలసంధి

అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్లలో ఉత్సాహాన్ని నింపిన శాంతి ఒప్పందం



**న్యూఢిల్లీ, జూన్14:**
పశ్చిమాసియాలో గత నాలుగు నెలలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ దేశాలు చారిత్రాత్మక శాంతి ఒప్పందానికి వచ్చాయి. దౌత్యపరమైన చర్చల అనంతరం రెండు దేశాలు తమ శత్రుత్వాన్ని వీడి, లెబనాన్ సహా

మిగతా 2లో



# ఐదేళ్లలో రెట్టింపు వాణిజ్యం

ప్రభుత్వం ఆహ్వానించింది. రాబోయే ఐదేళ్లలో ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ప్రస్తుత $15.81 బిలియన్ నుంచి రెట్టింపు చేయాలనే లక్ష్యంతో, టెక్నాలజీ, రక్షణ, పారిశ్రామిక వస్తువుల రంగాలపై దృష్టి సారించనున్నారు. ఈ పరిణామాలు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (FDI), విధానపరమైన మెరుగుదలలు, మౌలిక సదుపాయాల వృద్ధికి దారితీస్తాయని ఇన్వెస్టర్లు అంచనా వేస్తున్నారు. ఫ్రాన్స్‌లోని నీస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ కలిసి 'భారత్ ఇన్నోవేట్స్ 2026' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా, ఫ్రెంచ్ కార్పొరేషన్లను భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి, డిజైన్ చేయడానికి, తయారు చేయడానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆహ్వానించారు. మారుతున్న భౌగోళిక, సాంకేతిక పరిస్థితుల నేపథ్యంలో, ప్రపంచ వ్యాపారాలకు విశ్వసనీయ భాగస్వామిగా మారడానికి భారతదేశం సిద్ధంగా ఉందని ఈవెంట్ చాటిచెప్పింది. ముఖ్యంగా టెక్నాలజీ, రక్షణ, తయారీ రంగాల్లో భారత్ సామర్థ్యాలను ప్రదర్శించారు. గ్లోబల్ సప్లై చైన్‌లలో భారతదేశాన్ని మరింత లోతుగా అనుసంధానం చేయడమే ఈ చొరవ లక్ష్యం. ఫ్రెంచ్ కంపెనీలకు, భారతదేశం కేవలం తమ ఉత్పత్తులకు మార్కెట్ మాత్రమే కాదు, పరిశోధన, అభివృద్ధి, అధిక-విలువ ఉత్పత్తికి కేంద్రంగా మారుతోంది. ప్రస్తుతం, భారతదేశంలో 750 కి పైగా ఫ్రెంచ్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఏరోస్పేస్, ఇంధనం, ఆటోమోటివ్, ఐటీ వంటి రంగాలలో లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. 'మేక్ ఇన్ ఇండియా' ప్రయత్నాలను ప్రోత్సహించడం ద్వారా, భారత ఆర్థిక వ్యవస్థలో తయారీ రంగ వాటాను పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఫ్రెంచ్ పెట్టుబడిదారులకు యువ ప్రతిభావంతుల లభ్యత, విస్తరించదగిన మౌలిక సదుపాయాలు కీలక ప్రయోజనాలు అని ఈ ప్రతిపాదన స్పష్టం చేస్తోంది. ఇరుదేశాల ఆర్థిక సంబంధాలు బలపడుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు $15.81 బిలియన్లకు చేరుకుంది. ఈ సదస్సులో, రాబోయే ఐదేళ్లలో ఈ వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని ఇరు ప్రభుత్వాలు నిర్దేశించాయి. ఈ లక్ష్యానికి కొత్త ఆవిష్కరణ రోడ్‌మ్యాప్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం ఉమ్మడి ఫ్రేమ్‌వర్క్ మద్దతు ఇస్తాయి. ఫ్రాన్స్ ప్రస్తుతం భారతదేశంలో 11వ అతిపెద్ద విదేశీ పెట్టుబడిదారుగా ఉంది. కీలక ఖనిజాలు, అంతరిక్ష సాంకేతికత, పౌర అణుశక్తి రంగాలలో సహకారాన్ని పెంచడం ద్వారా ఈ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని అధికారులు ఆశిస్తున్నారు. విస్తరణ ప్రణాళికలు గణనీయంగా ఉన్నప్పటికీ, పెట్టుబడిదారులు, ఇప్పటికే ఉన్న కంపెనీలు సంక్లిష్టమైన కార్యకలాపాల వాతావరణాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. భారతదేశంలోని విదేశీ కంపెనీలు, కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లోని అనేక కార్మిక చట్టాలతో సహా సంక్లిష్టమైన నియంత్రణ వాతావరణాన్ని నిర్వహించాల్సి వస్తుంది. భూసేకరణ, నిబంధనల పాటింపు, ప్రామాణిక పరిపాలనా ప్రక్రియల అవసరం వంటి సవాళ్లు చర్చనీయాంశాలుగా మిగిలిపోయాయి.

# అధికారుల నిర్లక్ష్యంపై సీఎం సీరియస్



సీఎస్ కె.రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్ గారితో పాటు ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు శాఖ, వ్యవసాయ శాఖ, వాతావరణ శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. జూన్ 9న కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) లో వర్షం కారణంగా ఏర్పడిన పరిస్థితులు, తీసుకున్న చర్యలపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. సైబరాబాద్‌తో పాటు అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో నగరవాసులు ఇబ్బందులు పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మున్సిపల్, పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తం కాలేదన్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న సందర్భంగా జూన్ 1న సమీక్ష నిర్వహించి తాను స్వయంగా అనేక సూచనలు చేశానని గుర్తుచేశారు. అయినప్పటికీ కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జూన్ 9న నగరంలో వర్షం సమయంలో మున్సిపల్, పోలీసు అధికారుల మధ్య సమన్వయం లోపం స్పష్టంగా కనిపించిందన్నారు. ఈ పరిస్థితికి గల కారణాలను విశ్లేషించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలను ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు వర్షాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారు. వర్షం కురిసిన సమయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలి సిబ్బందితో పాటు సివిల్ పోలీసులు కూడా క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. పోలీసు కమిషనర్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు రోడ్లపైకి రావాల్సిందేనని తేల్చిచెప్పారు. అవసరమైతే తాను కూడా రోడ్డుపైకి వస్తానని అన్నారు. వర్షం కారణంగా ట్రాఫిక్ జామ్ అయితే ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ విభాగంలోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డీజీపీకి సూచించారు.;మానవ తప్పిదాల వల్ల సమస్యలు తలెత్తితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించనని హెచ్చరించారు. వర్షాల సమయంలో ఏర్పడే వాటర్ లాగింగ్ పాయింట్లు, బ్లాక్‌స్పాట్లు, ట్రాఫిక్ జామ్ అయ్యే ప్రాంతాల డేటా ఆధారంగా అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు. వర్షం కారణంగా పలు చోట్ల చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంపై ముఖ్యమంత్రి సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ పునరుద్ధరణ వెంటనేజ రగాలని సూచించారు. అవసరమైన చోట్ల మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. సీజన్‌లో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. మాన్యువల్ ప్రకారం ప్రాజెక్టుల నిర్వహణ ఉండాలన్నారు. వర్షాకాలంలో ప్రాజెక్టుల వద్ద సంబంధిత ఇంజినీర్లు తప్పనిసరిగా స్థానికంగా ఉండాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ప్రాజెక్టులను వదిలి వెళ్లే ఇంజినీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ కార్యదర్శిని ఆదేశించారు. ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాని ఆదేశించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలన్నారు. రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. యూరియా స్టాక్, పంపిణీ కోసం స్థానిక వ్యవసాయ అధికారిని బాధ్యుడిగా నియమించడంతో పాటు రెవెన్యూ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. సన్న వడ్ల కోసం వ్యవసాయ శాఖ ప్రకటించిన 8 రకాల విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. గతంలో తాగునీటి కలుషితం కారణంగా జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. నీటి కలుషితం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను సిద్ధం చేసుకోవాలన్నారు. వర్షాల కారణంగా నీటి నిల్వలు ఏర్పడి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నందున శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జలమండలి, వైద్య ఆరోగ్య శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ కి ముఖ్యమంత్రి సూచించారు. పోలీసు, ట్రాఫిక్, ఫైర్, హైడ్రా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని డీజీపీని ఆదేశించారు.



# మీనాక్షికి రేవంత్ వెన్నుపోటు

<

తప్పుడు కేసు బనాయించి వేధించారని విమర్శించారు. ఆమెకు మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ సీటు రాకుండా అడ్డుకునేందుకు బీజేపీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి అవినీతి, భూ ఒప్పందాలపై మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని, దీనికి ప్రతీకారంగానే హైదరాబాద్‌లో ఆమెపై తప్పుడు కేసు పెట్టించారని అన్నారు. సొంత పార్టీ నేతలనే వెన్నుపోటు పొడిచే నైజం రేవంత్ రెడ్డిదని ఆయన దుయ్యబట్టారు. హిట్లర్ తన ఆదర్శం అని సీఎం చెప్పడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనను 'అట్టర్ ఫ్లాప్ సినిమా'గా అభివర్ణించిన కేటీఆర్, ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని, కనీసం 4,000 ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని ప్రశ్నించారు. రూ.4,000 నిరుద్యోగ భృతి హామీని కూడా విస్మరించారని మండిపడ్డారు. కోటి మంది మహిళలను లక్షాధికారులను చేశామని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక రావడం ఖాయమని కేటీఆర్ జోస్యం చెప్పారు. ప్రజాతీర్పును ధిక్కరించి దానం నాగేందర్ కాంగ్రెస్‌లోకి ఫిరాయించడమే దీనికి కారణమని స్పష్టం చేశారు. జూన్ 25 నుంచి జరిగే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని, డిజిటల్ సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

# ట్రంప్ శాంతి మార్గం



అన్ని ప్రాంతాలలో సైనిక చర్యలను శాశ్వతంగా నిలిపివేయడానికి అంగీకరించాయని పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ ఆదివారం ప్రకటించారు. ఈ చారిత్రాత్మక ఒప్పందంపై వచ్చే శుక్రవారం (జూన్ 19) స్విట్జర్లాండ్‌లో ఇరు దేశాలు అధికారికంగా సంతకాలు చేయనున్నాయి. పాకిస్థాన్, ఖతార్, సౌదీ అరేబియా, టర్కీ దేశాలు ఈ శాంతి చర్చలలో కీలక మధ్యవర్తులుగా వ్యవహరించాయి. ఈ దౌత్యపరమైన ముందడుగును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతా ద్వారా ధ్రువీకరించారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు!" అని ఆయన పోస్ట్ చేశారు. అంతేకాకుండా, హర్మూజ్ జలసంధిపై ఉన్న అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని తక్షణమే తొలగిస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్.. వాణిజ్య నౌకల రాకపోకలకు జలసంధిని తిరిగి తెరుస్తున్నట్లు స్పష్టం చేశారు. "ప్రపంచ దేశాల నౌకలు.. మీ ఇంజన్లను స్టార్ట్ చేయండి. చమురును ప్రవహించనివ్వండి!" అంటూ ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెం గరీబాబాది కూడా ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ద్వారా ఈ ఒప్పందాన్ని, జూన్ 19 స్విట్జర్లాండ్ షెడ్యూల్‌ను అధికారికంగా ధ్రువీకరించారు. ఈ ఏడాది ప్రారంభంలో ఇరాన్ లక్ష్యాలపై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల అనంతరం ఇరు దేశాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీనికి ప్రతిచర్యగా ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం వాటా కలిగి ఉన్న వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. ఈ వివాదం లెబనాన్‌కు కూడా విస్తరించడంతో ప్రపంచ ఇంధన సరఫరా దెబ్బతింటుందనే భయాలు వ్యక్తమయ్యాయి. అయితే, తాజా ఒప్పందం ప్రకారం.. ప్రాథమికంగా 60 రోజుల కాల్పుల విరమణ (Ceasefire) అమలులో ఉంటుంది. అలాగే ఇరాన్ అణు కార్యక్రమం, ప్రాంతీయ భద్రతపై తదుపరి చర్చలు జరపడానికి ఒక ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించారు. ఈ శాంతి వార్త అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్లలో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. హర్మూజ్ జలసంధి నుంచి చమురు రవాణా పునఃప్రారంభం అవుతుందనే అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 85 డాలర్ల కంటే కిందకు పడిపోయాయి. అయితే, ఈ ఒప్పందంలో ఇజ్రాయెల్ నేరుగా భాగస్వామి కాకపోవడంతో, భవిష్యత్తులో ఈ శాంతి ఒప్పందం ఎంతవరకు స్థిరంగా కొనసాగుతుందనే ప్రశ్నలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయినప్పటికీ, గత కొన్ని నెలలుగా యుద్ధ భయాలతో కాలం గడుపుతున్న మధ్యప్రాచ్య దేశాల ప్రజలకు, అంతర్జాతీయ వాణిజ్య వర్గాలకు ఈ దౌత్యపరమైన ముందడుగు పెద్ద ఊరటను ఇచ్చింది.

# రాజాం సింహాద్రి చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు

**వారం రోజులుగా రియల్ ఎస్టేట్ వ్యాపారి తరలింపు**

**వ్యాపారికి సహకరిస్తున్న బుచ్చయ్యపేట ఎమ్మార్వో**

**పైసా వసూల్ చేస్తున్న రెవెన్యూ అధికారులు**

**ముడుపులిస్తే చెరువులు మొత్తం తవ్వేసిన పట్టించుకోరు?**

**కలెక్టర్ గారూ.. కనీసం మీరైనా దృష్టి సారించండి**

**బుచ్చయ్యపేట, జూన్14(క్విక్ టుడే న్యూస్):** బుచ్చయ్యపేట మండలంలో రాజాం గ్రామంలో సింహాద్రి చెరువులో గత వారం రోజులుగా సుమారు మూడు జెసిబి లు పెట్టి 40 ట్రాక్టర్లతో చెరువులో నుంచి మట్టిని సమీపంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి తీసుకున్న పది ఎకరాలు భూమిలో రోడ్డు వరకు కప్పించడానికి ఒప్పం



దాలకుదురుచుకున్నారు ఈ భూమిని చెరువులో మట్టిని కప్పడానికి గ్రామ నాయకులకు ట్రిప్పుకు రూ.100 చొప్పున ఒప్పందం కుదుర్చుకున్నారు. విలేకరులకు ఇరిగేషన్ వరకు మండలంలో ఉన్న ఇరు పార్టీ నాయకులకు ముడుపులందయని సమాచారం. మండలంలో ఉన్న ప్రతిపక్ష నాయకులే ఈ మట్టి తవ్వకాలకు ఒప్పందాలు కుదరచడం కొసమెరుపు. మండల ఎమ్మార్వోని వివరణ అడగగా రాత్రిపూట తోలుతే మేమేం చేయాలి అనే విధంగా మాట దాటేస్తున్నారు ఈ యొక్క చెరువు కింద రైతులు అడగగా ఎవరి వాటా వాళ్లకి ఇచ్చేసాం మమ్మల్ని ఎవరూ ఏం చేయలేరని మట్టి తోలించుకుంటున్న బిల్డర్ సమాధానం ఇస్తున్నారు. వెంటనే గౌరవ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఈ యొక్క మండలం పై దృష్టి సారించి సదరు ఎమ్మార్వో మరియు ఇరిగేషన్ అధికారులపై వెంటనే చర్యలు తీసుకొని ఈ మట్టి తవ్వకాలను ఆపించవలసిందిగా ప్రజలు కోరుకుంటున్నారు. ఈ మధ్యకాలంలోనే వడ్డాది దేవస్థానం భూముల్లో ఇలాగే మట్టి తవ్వకాలు జరగగా గ్రామస్తులు అడ్డుకున్నారు, ఇదే గ్రామంలో మరిశావాని చెరువు లో తవ్వకాలు జరగగా అప్పుడు క్విక్ టుడే న్యూస్ లో ప్రచురించగా వెంటనే



స్పందించి అధికారులు ఆపారు. ఇప్పుడైతే ఏకంగా ఐదువేల ట్రిప్పులు అవసరం పడగా మండలంలో ఉన్న పత్రికా విలేకరులకు ఎవరూ రాయకుండా ముడుపులు అందించారని.. మా బాధ ఎవరు పట్టించుకుంటారు అని ప్రజలు లబోదిబోమంటూ ఏడుస్తున్నారు.